క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని నాగర్‌గూడ ఆలయ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్ పేర్కొనారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ శ్రీకృష్ణ ఆలయ 7వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం (రేపు) నుంచి భగవాన్ శ్రీకృష్ణ నామ సంకీర్తనతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని తెలిపారు. నెల రోజుల పాటు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందరూ భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.

సుందరం.. సూర్యోదయం



షాబాద్-నరెడ్లగూడలో బంగారు రంగులో భానుడు

షాబాద్: చలికాలంలో కనిపించే ప్రతీ సూర్యోదయం కనువిందుగానే ఉంటుంది. మంచు మబ్బులను చీల్చుకుంటూ వచ్చే భానుడి బంగారు రంగు కిరణాలు మనసును హత్తుకుంటాయి. పచ్చని పంట పొలాలు, కిలకిల రావాలు చేసే పక్షులతో కూడిన పల్లె అందాల నడుమ కనిపించే భానోదయం చూడముచ్చటగా ఉంటుంది. షాబాద్ మండలం నరెడ్లగూడ గ్రామంలో కనిపించిన ప్రకృతి రమణీయ చిత్రాన్ని సోమవారం సాక్షి క్లిక్ మనిపించింది.

దివ్యాంగులు సద్వినియోగం చేసుకోండి

ఏపీఎం భగవంతు



దివ్యాంగుడికి సూచనలిస్తున్న సురక్షిత

కేశంపేట: మండల కేంద్రంలో నిర్వహించే మనోప్రగతి క్యాంపులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు సూచించారు. స్థానిక మానవ వనరుల కేంద్రంలో సోమవారం మనోప్రగతి క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెషనల్ స్పీచ్ థెరపిస్టు సురక్షిత, స్పెషల్ ఎడ్యుకేటర్ కవితతో పాటు భగవంతు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనోప్రగతి క్యాంపును నెలలో రెండుసార్లు నిర్వహిస్తామని తెలిపారు. క్యాంపులో సూచనలు, సలహాలు ఇస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ నరసింహ, సీఆర్పీ వసంత, ఆడిటర్ గిరి, సీసీలు యాదయ్య, రాంచంద్రయ్య, తిరుపతమ్మ, జంగయ్య పాల్గొన్నారు.

సమ్మెకు సై

తపాలా ఉద్యోగుల నోటీసు



పోస్ట్‌మాస్టర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న జీడీఎస్‌లు

కేశంపేట: తమ డిమాండ్‌లను పరిష్కారించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. సోమవారం యూనియన్ నాయకులు కేశంపేట సబ్‌పోస్ట్ మాస్టర్ శ్రీనివాసులుకు సమ్మె నోటీసు అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. 12, 24, 36 ఏళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి సీనియర్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రూప్ ఇన్సురెన్స్‌ను రూ.5లక్షలకు పెంచాలని, కమీషన్ పద్ధతిని రద్దు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించేవరకు సమ్మె కొనసాగిస్తామని ప్రకటించారు. సమ్మె నోటీసు ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, మసూద్ అలీ, రాములు, సాయిలు, దేవేందర్, మహేశ్, రమేశ్, రాజు, ప్రవీణ్, చందు ఉన్నారు.

17 నుంచి ధనుర్మాస ఉత్సవాలు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శ్రీ వేంకటగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 17 నుంచి జనవరి 15 వరకు ధనుర్మాస ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు అర్చకులు కృష్ణమాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఉంటాయని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

యాసంగి సాగేనా..?



- తగ్గనున్న సాగు విస్తీర్ణం
- పత్తి దిగుబడిపై వర్షాల ప్రభావం
- శనగ, జొన్న సాగుపై ఆసక్తి

షాబాద్: మండలంలో ఈ ఏడాది వానాకాలంలో మొక్కజొన్న పంట సాగు తగ్గి పత్తి సాగు పెరిగింది. గతేడాది పత్తి ధర అధికంగా ఉండడంతో పత్తి సాగుపై రైతులు ఆసక్తి చూపారు. ఈ వానాకాలంలో 33వేల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. 8 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 2వేల ఎకరాల్లో జొన్న పంట వేశారు. ఈ ఏడాది 35 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. రబీలో 7 వేల ఎకరాల్లో శనగ, 3వేల ఎకరాల్లో జొన్న పంట సాగు చేశారని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈ నెల చివరి వరకు సాగు

రబీ సాగులో డిసెంబర్ చివరి వరకు పంటలు వేయనున్నారు. అందులో భాగంగానే మండలంలో శనగ, జొన్న పంటలను సాగు చేసేందుకు రెడీ అవుతున్నారు. మొక్కజొన్న పంటలను తొలగించిన రైతులు ఈ నెల చివరి వరకు పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలు పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడింది. పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే రబీలో సాగు చేసే పంట దిగుబడులపై ఆధారపడావాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.



తగ్గే అవకాశం ఉంది

వానాకాలంలో ఈ ఏడాది పత్తి సాగు పెరిగి మొక్కజొన్న సాగు తగ్గింది. దీంతో రబీ పంట సాగు తగ్గే అవకాశం ఉంది. మొక్కజొన్న పంటను తొలగించిన రైతులు రబీలో శనగ, జొన్న లాంటి పంటలు సాగు చేసేందుకు సిద్ధపడుతున్నారు. ఈ నెల చివరి వారం వరకు పంటలు వేసుకుంటారు.

– వెంకటేశం, మండల వ్యవసాయాధికారి, షాబాద్

సంపూర్ణ ఆరోగ్యంతో సత్ఫలితాలు



దాతలను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు.

షాద్‌నగర్ రూరల్: విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే సత్ఫలితాలను సాధిస్తారని ఐసడక్ ఎక్స్‌ప్రెస్‌వే మేనేజర్ మహ్మద్ అలీ ఇబ్రహీం అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐ సడక్ ఎక్స్‌ప్రెస్ వే ఆధ్వర్యంలో 2వేల లీటర్ల ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని వ్యాఖ్యానించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యవంతులుగా ఉండాలని అన్నారు. కలుషిత నీటిని తాగడం వలన రోగాల బారిన పడతామని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగితే లక్ష్యాన్ని చేరుకోవచ్చని సూచించారు. అనంతరం పాఠశాలకు డెస్క్‌టాప్, కలర్ ప్రింటర్, ప్రొజెక్టర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మురళీధర్‌రెడ్డి, ఏపీ.రాజు, విజయ్, ప్రధానోపాధ్యాయులు సతీశ్, కరుణశ్రీ, ఉపాధ్యాయులు రేవతి, జ్యోతి, సర్ఫరాజ్, అన్వర్, నీల్యా, పంచాయతీ కార్యదర్శి ఆరాధన, విద్యార్థులు పాల్గొన్నారు.

పల్లా రాజేశ్వర్‌రెడ్డికి సన్మానం



రాజేశ్వర్‌రెడ్డిని సన్మానిస్తున్న రవియాదవ్ తదితరులు

మొయినాబాద్ రూరల్: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిని అఖిల భారతయాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ముదిగొండ రవియాదవ్ ఘనంగా సన్మానించారు. విద్యాజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్‌గా రాజేశ్వర్‌రెడ్డి ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని కొనియాడారు. అనంతరం రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలు తీర్పు ఏది ఇస్తే అదే జరుగుతుందని సూచించారు. ఈ కార్యక్రమంలో షాబాద్ గిరి, అశోక్, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సౌకర్యాలు కల్పించాలి

చేవెళ్ల: రైతులకు మార్కెటింగ్ సౌకర్యాలను అందుబాటులోకి తేవాలని, దీనివల్ల వారికి ఎంతో మేలు జరుగుతుందని భారతీయ కిసాన్‌సంఘం జిల్లా కార్యవర్గసభ్యుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలోని మార్కెట్ కార్యాలయం వద్ద సోమవారం భారతీయ కిసాన్ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి చేవెళ్ల మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట రంగారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మార్కెట్ చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో రైతుల కోసం సాయంకాలం మార్కెట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందని చైర్మన్ తెలిపారు. దీనికి వ్యవసాయ కమిటీ సంఘాలన్నీ సహకరించాలని కోరారు. దీనిపై స్పందించిన సంఘం నాయకులు చేవెళ్ల ప్రాంతంలో ఎక్కువగా కూరగాయల పంటలు పండిస్తున్నారని మార్కెట్ సౌకర్యం అందుబాటులో ఉండటం ఎంతో అవసరమన్నారు. ఈ సమావేశంలో సంఘం అధ్యక్షుడు పెంటారెడ్డి, సభ్యులు రాజేంద్రప్రసాద్, శివుడు, మల్లారెడ్డి, శ్రీకాంత్, నర్సింహారెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వింటర్ బజార్

మొయినాబాద్ రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలోని స్లోకా ది హైదరాబాద్ స్కూల్‌లో ఘనంగా వింటర్ బజార్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వారి కుటుంబ సభ్యులతో పాటు పాఠశాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ వార్షికోత్సవంలో 4వ తరగతి విద్యార్థుల తల్లిదండ్రులు ఏకత్వ పేరుతో జరిగిన సంతలో కుట్లు, అల్లికలు, చేతి పనులు, చిత్ర కళ ప్రదర్శనతో పాటు భోజన సదుపాయాన్ని కల్పించారు. వివిధ రాష్ట్రాల్లో తయారు చేసిన వస్త్రాలను విక్రయించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవియాదవ్ పాల్గొని.. విద్యార్థులు నిర్వహించిన స్టాల్స్‌ను పరిశీలించి అభినందించారు. వ్యాపార రంగంలో ఓర్పు, నైపుణ్యం ఉంటేనే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు.

అతిథి అధ్యాపక పోస్టులకు ఆహ్వానం

షాద్‌నగర్ రూరల్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నీతా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలోని నూర్ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో కొనసాగుతున్న మహిళా డిగ్రీ కళాశాలలో మైక్రోబయోలజీ-1, కంప్యూటర్ సైన్స్-1, కెమిస్ట్రీ-1, జువాలజీ-1 బోధించుటకు అతిథి అధ్యాపకులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన మహిళా అభ్యర్థులు సంబంధిత పత్రాలతో ఈ నెల 12, 13 తేదీల్లో కళాశాలలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 8341915656, 6300051306, 9885003390 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.

వాసవిక్లబ్ ఉపాధ్యక్షుడి ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న పాండురంగయ్య

షాద్‌నగర్ రూరల్: వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ 2024 సంవత్సరానికి ఉపాధ్యక్షుడిగా పట్టణానికి చెందిన దొంతు పాండురంగయ్య ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి విజయవాడలో నిర్వహించిన వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన పాండురంగయ్యతో వాసవిక్లబ్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవిచంద్రన్ ప్రమాణస్వీకారం చేయించారు.

ఆలయాలు కిటకిట

మొయినాబాద్ రూరల్: కార్తీక సోమవారం చివరి రోజు కావడంతో మండల పరిధిలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మండల పరిధిలోని కనకమామిడి సంగమేశ్వర ఆలయం, హిమాయత్‌నగర్ సోమేశ్వర ఆలయం, హిమాయత్‌నగర్ చౌరస్తాలోని లోటస్ టెంపుల్ శివాలయంలో భక్తుల సందడి నెలకొంది. కార్తీక మాసంలో చివరి సోమవారం కావడంతో జంట నగరాలతో పాటు వివిధ ప్రాంతాల నుంచి ఈ ఆలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే కనకమామిడి సంగమేశ్వరాలయంలో భక్తులు పోటెత్తారు.

హైతాబాద్‌లో అయ్యప్ప పడిపూజ



పూజా కార్యక్రమంలో కుటుంబసభ్యులతో నర్సింలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: పట్టణంలోని ఎల్ఎన్ కాలనీలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో సోమవారం పట్టణానికి చెందిన వ్యాపారవేత్త నాగిళ్ల గోపాల్ గుప్తా, వారి కుమారులు నాగిళ్ల భవానీ దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, మాజీ మున్సిపల్ చైర్మెన్ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, భద్రప్ప, కోటి లింగం, భవనం శ్యాం, చెట్ల రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

షాబాద్: స్వామియే శరణం అయ్యప్ప అంటూ హైతాబాద్ గ్రామం మారుమోగింది. సోమవారం మండలంలోని హైతాబాద్ గ్రామంలో నర్సింలు స్వామి ఏర్పాటు చేసిన అయ్యప్ప పడి పూజను గోపాల్‌రెడ్డి గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని అయ్యప్ప మాల ధరించిన స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొని అయ్యప్ప పూజ నిర్వహించారు. అయ్యప్ప నామస్మరణం, అయ్యప్ప పాటలతో అలరించారు. భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడి పూజ నిర్వహించారు. అయ్యప్ప మాలదరించిన స్వాములతోపాటు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజ అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలి

ఐఏఎస్ మాజీ అధికారి అక్బర్



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న అక్బర్

మొయినాబాద్‌రూరల్: క్రమశిక్షణ, పట్టుదలతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఐఏఎస్ మాజీ అధికారి ఎం.జే. అక్బర్ ఆకాంక్షించారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ సమీపంలోని పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అక్బర్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. విద్య ఉంటే సమాజంలో గుర్తింపు లభిస్తుందని, ప్రతీ ఒక్కరూ చదువుకొని, అనుకున్న లక్ష్యాలను నెరవేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పల్లవి ఇంటర్నేషనల్ పాఠశాల వ్యవస్థాపకుడు ఎం.కొమురయ్య, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వైస్ చైర్మన్ జహీర్, హిమాయత్‌నగర్ పల్లవి పాఠశాల డైరెక్టర్ యశస్వి, ప్రిన్సిపాల్ హేమ, వైస్ ప్రిన్సిపాల్ మీను, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ కోసం..

జెడ్పీటీసీ తాండ్ర విశాల



విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న విశాల

షాద్‌నగర్: ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు ఎంతో ఉపయోగపడతాయని జెడ్పీటీసీ తాండ్ర విశాల అన్నారు. పట్టణంలోని ఠాగూర్ పాఠశాల మైదానంలో సౌత్ ఇండియా కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్‌షిప్ పోటీలను సోమవారం నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని మాస్టర్ శివకృష్ణగౌడ్ తెలిపారు. కరాటే కతాస్ విభాగంలో వైష్ణవి, లావణ్య, జ్యోతి, వైష్ణవి, మీనా, సావిత్రి, గంగమ్మ మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. విద్యార్థులకు సినీ హీరో ఇంద్రసేన, తాండ్ర విశాల ట్రోఫీలతో పాటుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విశాల మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు యుద్ధ విద్యలు కూడా నేర్చుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని ఆత్మరక్షణ కోసం యుద్ధ విద్యలు నేర్చుకోవాలని సూచించారు. అదేవిధంగా విద్యార్థులు చదువుల్లో రాణించి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కరాటేలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం శివకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర శ్రావణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి



ప్రతాప్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ కుమ్మరి సంఘం నాయకులు సోమవారం ప్రతాప్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలు విసుగు చెంది.. కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించడం ఖాయమని అన్నారు. పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రెండింటిని అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశారని పేర్కొన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అందరూ సహాయ సహకారాలు అందించాలని కోరారు. అన్ని వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు రమేశ్, సాయిలు, రాంచందర్, వెంకటేశ్, జ్ఞానేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



అరిస్టాటిల్ పీజీ కళాశాలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

మొయినాబాద్: ఆరోగ్యమే మహాభాగ్యమని, అందరూ ఆరోగ్యంగా ఉండాలని అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అరిస్టాటిల్ పీజీ కళాశాలలో సోమవారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన మాక్స్‌విజన్ సూపర్ స్పెషాలిటీ కంటి ఆస్పత్రి, జర్మన్‌టెన్ ఆస్పత్రి, క్లోవ్ డెంటల్ ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. అవసరమైనవారికి మందులు, వైద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అందరికీ మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ లయన్స్ క్లబ్ ప్రతినిధి రమాదేవి, వైద్య శిబిరం కోఆర్డినేటర్ స్వేత, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మల్లారెడ్డి, అధ్యాపకులు కనకారావు, దీప్తి, రమేశ్, రాజేందర్‌రెడ్డి, స్రవంతి, జ్యోతికసోని, హైదరాబాద్ క్యాపిటల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాకేశ్‌కు డాక్టరేట్



రాకేశ్‌కు డాక్టరేట్ పట్టాను అందజేస్తున్న పురుషోత్తమ్‌రెడ్డి తదితరులు

మొయినాబాద్ రూరల్: చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కళాశాలలో కెమిస్ట్రీ విభాగంలో బయోలాజికల్ ఎవాలోషన్ ఆఫ్ సమ్ నావేల్ 1,2,3 ట్రయోజోల్ డేరివెటీయూస్ అంశంపై డాక్టర్ ఎస్.నర్సింహ పర్యవేక్షణలో రాకేశ్ శ్రీరామ పరిశోధన చేశారు. సోమవారం చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కులపతి డాక్టర్ సి.హెచ్.పురుషోత్తమ్‌రెడ్డి, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ డాక్టర్ సాత్వికరెడ్డి, రాకేశ్‌కు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పురుషోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ కష్టపడి పని చేసిన వారికి తప్పకుండా గుర్తింపు వస్తుందని తెలిపారు. కళాశాలలో విద్యార్థుల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న అధ్యాపకులు మరింత కృషి చేయాలని సాత్వికరెడ్డి కోరారు. ఉత్తమ ఫలితాలతో కళాశాలకు ఎంతో గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ రిలేషన్ అధికారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హక్కులు లేని మనిషి బానిసే

మానవ హక్కుల సంఘం ఫౌండర్ బాలరాజ్



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్ రూరల్: భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ రావూరి బాలరాజ్ అన్నారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్‌లో ఇండియన్ హైట్స్ స్కూల్‌లో ట్రిలా సూపర్ వెడ్డింగ్ యాప్ ప్రతినిధి మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిత్యావసర సరుకులు, వస్తువుల విక్రయాల్లో జరిగే మోసాలను పసికట్టాలని సూచించారు. హక్కులు లేని మనిషి బానిసతో సమానమని పేర్కొన్నారు. హక్కులపై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్నప్పుడే మోసాలను నివారించవచ్చని చెప్పారు. సమాజంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై విద్యార్థి దశ నుంచే ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి విద్యార్థి విద్యావంతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. సమస్యలు చుట్టుముట్టినా కుంగిపోకుండా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయితేజ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె కృష్ణ, రాష్ట్ర ఐటీవింగ్ కార్యదర్శి రాఘవేందర్‌గౌడ్, అడ్వయిజరీ చైర్మన్ గోపికృష్ణ, జాతీయ బ్యాట్మింటన్ నవ్యరావు, వెయిట్ లిఫ్టింగ్ గోల్డ్ మెడలిస్ట్ స్ఫూర్తి , రైల్వే బోర్డు సభ్యులు గోపాల్‌నారాయణ్, పాఠశాల చైర్మన్ భువనేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.